నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



నవతెలంగాణ-రామారెడ్డి

ముక్కుపచ్చలారని 15 సంవత్సరాల బాలికకు వివాహం చేయగా గురువారం సమాచారం అందుకున్న అధికారులు అడ్డుకొని ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చారు. సిడబ్ల్యుసి జిల్లా కమిటీ మెంబర్ స్వర్ణలత వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో గుట్టు చప్పుడు కాకుండా పదవ తరగతి పూర్తి చేసిన బాలికకు, అదే గ్రామానికి చెందిన 24 సంవత్సరాల అబ్బాయితో బుధవారం ఉదయం వివాహం చేయగా.. గురువారం బాల్య వివాహ చట్టం నిర్మూలన చైల్డ్ కోఆర్డినేటర్ స్వరూప, వివాహిత ఇంటికి వెళ్లి ఇరు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలికను బాలల కోర్టులో హాజరు పరిచి, అనంతరం బాలసదన్ హోమ్‌కు తరలించామని అధికారులు తెలిపారు.

ఎంపీడీవో కార్యాలయానికి తాళం

- 26 నెలల అద్దె చెల్లించకపోవడంతో తాళం వేసిన యజమాని

నవతెలంగాణ-వర్ని(చందూర్)

నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ భవనం అద్దెను 26 నెలల నుంచి చెల్లించకపోవడంతో ఇంటి యజమాని ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం ఎంపీడీఓ కార్యాలయ అధికారులను, సిబ్బందిని బయటకు పంపించి తాళం వేశారు. దీంతో అధికారులు, సిబ్బంది గంటల తరబడి ఆరుబయటే కూర్చున్నారు.



అద్దె చెల్లించకపోవడంతో తాళం వేస్తున్న యజమాని

వివరాలు మెయిన్‌లో..



కాలువపైన నిర్మించిన రేకుల షెడ్డు

కాలువపైనే..
యథేచ్ఛగా షెడ్డు నిర్మాణం

- ఆక్రమణకు పంచాయతీ సిబ్బంది సహకారం

నవతెలంగాణ-బోధన్

సాలూర గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే గల కాలువపై ఓ వ్యక్తి యథేచ్ఛగా రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో సదరు వ్యక్తి దర్జాగా కాలువపైనే రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆక్రమణలు జరిగితే చర్యలు తీసుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది ఆక్రమణ దారులకు సహకరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ స్థలాలను, కెనాల్‌లను ఆక్రమించి వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతుంటే, సాలూరలో యథేచ్ఛగా కాలువలపై నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ను వివరణ కోరగా కాలువపై నిర్మాణం తన దృష్టికి రాలేదని దానిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నవజాత శిశువులపై
ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యం

- సాయి ఆయుష్ ఆస్పత్రిలో నవజాత శిశువు మృతి
- సరైన వైద్యం అందించలేదని బాధిత కుటుంబ సభ్యుల ఆరోపణ
- ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన



ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు, వైద్య సిబ్బంది ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. అందుకు నిదర్శనం జిల్లా కేంద్రంలోని సాయి ఆయుష్ ఆస్పత్రిలో గురువారం నవజాత శిశువు మృతిచెందిన ఘటనే నిదర్శనం. రోగులను సరైన చికిత్స అందించి బతికించాలని ఆలోచనను పక్కకునెట్టి.. డబ్బే పరమావధిగా పనిచేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

రెంజల్ మండలంలోని తాడ్‌బిలోలికి చెందిన నరేశ్ తన భార్య నాగమణి గర్భిణిగా ఉన్న సమయంలో ఏడు నెలల్లోనే (గత నెలలో) బాలుడికి జన్మనిచ్చింది. బాబు తక్కువ బరువు ఉండడంతో సాయి ఆయుష్ ఆస్పత్రిలో చేర్పించారు. బాలుడికి చికిత్స అందించేందుకు రూ.3లక్షల ప్యాకేజీతో వైద్యుడితో మాట్లాడుకున్నారు. కాగా వైద్యం కోసం బాధితులు రూ.లక్ష చెల్లించారు. బాలుడి పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. అయితే బాలుడి మృతదేహాన్ని అప్పగించాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని అడిగితే.. మిగతా డబ్బులు చెల్లిస్తేనే మృతదేహాన్ని అప్పగిస్తామని స్పష్టం చేశారు. అయితే మరో రూ.50 వేలు చెల్లిస్తానని చెప్పినా ఇవ్వడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆస్పత్రిలో సరైన వైద్యం అందించకపోవడంతోనే బాలుడు మృతిచెందాడని ఆరోపిస్తూ బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు.

బేబీకి లంగ్స్ వీక్ అవడంతో మృతి



900 గ్రాములతో బాలుడు ఉండడం కొద్దిగా కష్టమైనా.. తమ ఆసుపత్రిలో 40 రోజుల క్రితం అడ్మిట్ చేసుకొని చికిత్స అందించాం. 36 వారాల తర్వాత పుట్టాల్సిన బేబీ 27 వారాలలోనే పుట్టాడు. వందలో 70 శాతం మందికి మాత్రమే బతికే అవకాశం ఉంటుంది. కానీ బేబీలో సమస్యలుంటాయని ముందే తల్లిదండ్రులకు వివరించాం. ప్రతి విషయం కుటుంబ సభ్యులకు వివరించాకే తమ ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని చికిత్సను అందించాం. మొదట పది రోజులు వెంటిలేటర్‌పై చికిత్సను అందించాం. బేబీలో ఫీడింగ్ సమస్య, దమ్ము కూడా ఉండడం కొంతవరకు తగ్గింది. కొద్దిగా కోలుకున్న అతి త్వరగానే మళ్లీ బేబీకి ఇంటర్నల్ సమస్య రావడంతో ఇబ్బంది కలిగింది. మా ప్రయత్నం మేము పూర్తిగా చేసినప్పటికీ బేబి లంగ్స్ వీక్ ఉండడం వలన మృతి చెందింది.

– సాయి ఆయుష్ ఆసుపత్రి డాక్టర్ సాయి సంకీర్త్ రావు

మరో ఘటనలో..

అలాగే జిల్లా కేంద్రంలోని మరో ప్రైవేటు ఆసుపత్రిలో గత సెప్టెంబర్ నెలలో బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఓ గర్భిణీ ఏడు నెలలకే ప్రసవించడంతో నవజాత శిశువు ఒక కేజీ బరువుతో జన్మించాడు. ఓ ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం వైద్యులు వైద్యం అందించి ఆ నవజాత శిశువును బతికిస్తామని చెప్పి వారి దగ్గర డబ్బులు చెల్లించాలని బలవంతం చేశారు. ఈ క్రమంలో ఆ నవజాత శిశువు మృతి చెందింది. మృతి చెందిన తర్వాత కూడా వైద్యం చేసిన ఖర్చులైన చెల్లించి ఆ మృతదేహాన్ని తీసుకువెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం, వైద్యులు తెలిపినప్పటికీ చనిపోయిన నవజాత శిశువును ఏ విధంగా తీసుకువెళ్తాం అని బాధితులు తెగేసి చెప్పడంతో ఆసుపత్రి యాజమాన్యం పిలిచి నవజాత శిశువు మృతదేహాన్ని అప్పజెప్పారు. ఈ విషయం బయటకు పొక్కకుండా ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంది.



వర్షానికి తడిసిన ధాన్యం

తడిసిన ధాన్యం..

- ఆందోళనలో రైతులు

నవతెలంగాణ-లింగంపేట్/ఎల్లారెడ్డి

బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురవడంతో కల్లాల వద్ద ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట కోతకు రావడంతో రైతులు ధాన్యాన్ని కోసం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ముందస్తుగా బోరుబావుల వద్ద వరినాట్లు వేసిన రైతులు వరి పంట కోతకు రావడంతో కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలోని భవానిపేట్, జల్లిపల్లి, మంబోజిపేట్, పర్మల్ల, శెట్టిపల్లి అయ్యపల్లి, రాంపూర్, పోతాయిపల్లి, పోల్కంపేట్, కన్నాపూర్, లింగంపేట్‌తో పాటు ఆయా గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. అధికారులు సకాలంలో స్పందించి తూకంలో జాప్యం లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన..

ఎల్లారెడ్డి : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఇటీవల ప్రారంభమైన కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న రైతుల వరి ధాన్యం బుధవారం తెల్లవారు జామున కురిసిన వర్షానికి వరి ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. దీంతో గురువారం సొసైటీ చైర్మన్ ఏవుల నర్సింలు కళ్ళల వద్ద తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తూ కలత చెందారు. రైతులకు వరికుప్పలపైన తాడిపత్రిలు కప్పుకొని జాగ్రత్త వహించాలని సూచించారు.

నిబంధనలు పాటించాలి

- అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవు
- పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వెల్లడి



నవతెలంగాణ కంఠేశ్వర్

నిజామాబాద్ ప్రజలు తూచా తప్పకుండా పోలీస్‌శాఖ నియమ నిబంధనలను పాటించాలని, నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని సూచించారు. ముఖ్యంగా జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్ ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేయవద్దని తెలిపారు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎక్కువ శబ్దంతో డీజేలను ఏర్పాటు చేయవద్దని, ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. రెసిడెన్షియల్, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు డి.జేల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదని తెలిపారు. ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి.జేలు సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిష నరేటు పరిధిలో నిషేధం గలదని, ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుంచి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని తెలిపారు. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్‌పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనధికారికంగా వ్యాపారాలు నిర్వహిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాన్ని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తున్నట్టు పేర్కొన్నారు.

నిజామాబాద్‌లో పోలీస్ సంస్మరణ వారోత్సవాలు ప్రారంభం..

నిజామాబాద్ పోలీస్ సిబ్బంది తమ అమూల్యమైన ప్రాణాలను విధి నిర్వాహణలో భాగంగా త్యాగం చేశారని, వారి త్యాగం వలనే నేడు శాంతియుత వాతవరణం నెలకొన్నదని, ప్రజలు కూడా శాంతి యుతంగా ఉంటున్నారని వారి త్యాగలను గుర్తుచేసుకోవడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మేరకు పోలీసు సంస్మరణ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ గురువారం వెల్లడించారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో అమరవీరుల దినోత్సవం, క్యాండిల్ ర్యాలీలు, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు, వ్యాసరచన పోటీలు, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలీం పోటీలు, ఉచిత రక్తదాన శిబిరం కార్యక్రమం, జాతీయ ఐక్యతా దినోత్సవం, పోలీస్ కళా బృందం, పోలీస్ బ్యాండ్ ద్వారా జనరద్దీ గల ప్రాంతాలలో కార్యక్రమాల నిర్వహణ చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

'మాజీ సర్పంచ్ నుంచి నాకు ప్రాణహాని ఉంది'

నవతెలంగాణ-భిక్కనూర్

మాజీ సర్పంచ్ నుండి నాకు ప్రాణహాని ఉందని బాధితుడు పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. భిక్కనూరు పట్టణానికి చెందిన రాజు రెండు రోజుల క్రితం పట్టణంలో గంగల రవీందర్ ఫ్లెక్సీలను చింపి వేసినందుకు మద్దతుగా చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ధర్నా నిర్వహించినందుకు పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ తన ఇంటికి పిలిపించుకొని ధర్నా ఎందుకు చేశావని నీకేం అవసరమని నన్ను, మా కుటుంబ సభ్యులను బెదిరించాడు.

మరోసారి ధర్నా చేస్తే నేను ఏమి చేస్తాను నీకు తెలియదని బెదిరించడంతో రాజు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ నుండి నాకు, నా కుటుంబానికి ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-బాన్సువాడ (నసురుల్లాబాద్)/వర్ని

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారుల మాటలు నమ్మి విక్రయించవద్దని రైతులు మోసపోవద్దని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని బుడ్మి, తాడ్కోల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పిఎసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కోపిశెట్టి కిరణ్మయి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అవుతుందన్నారు. రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తమ ప్రభుత్వం మద్దతు ధర, రైతు భరోసా ఇస్తుందన్నారు. రైతులు ధాన్యం దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బుడిమి సొసైటీ చైర్మన్ గంగుల గంగారాం, వైస్ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షులు కృష్ణరెడ్డి, వ్యవసాయ శాఖ ఎఇఒ రాణి, మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఖాలేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్, అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, మోహన్ నాయక్, పిట్ల శ్రీధర్, నార్ల సురేష్, మాజీ సర్పంచ్ రాజు, ఆఫ్రోజ్, ఎజాస్, భీమానాయక్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని : మండలంలోని హుమ్నాపూర్ గ్రామంలో గల సొసైటీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, వర్ని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబాతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మెన్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వీరాజ్, గ్రామ అధ్యక్షులు గట్టు సాయిలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిష్టాగౌడ్, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ గంగామణి, సొసైటీ చైర్మన్ కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి ఆరోగ్య పరీక్షలు
నిర్వహించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అశీష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి/గాంధారి

ప్రతీ ఉద్యోగి ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకోవాలని, దైనందిన జీవితంలో ప్రతీ ఒక ఉద్యోగి తన ఆరోగ్య పరిరక్షణ అవసరమని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లా అధికారుల సంక్షేమ సంఘం, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం సంయుక్తంగా గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. పలు పరీక్షల నిర్వహణ కౌంటర్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరంలో 370 మంది ఉద్యోగులు వివిధ పరీక్షలు నిర్వహించుకున్నారు. సి.బి.పి, ఎల్.ఎఫ్.టీ, బ్లడ్ యూరియా, ఏ1సి, మొదలగు పరీక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో కొంతమందికి శుక్రవారం డాక్టర్ల సూచన మేరకు లిపిడ్ ప్రొఫైల్, బి 12, థైరాయిడ్, తదితర పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.చంద్రశేఖర్ నేతృత్వంలో ఈ ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, డిఒడబ్ల్యుఏ అధ్యక్షులు రాజారాం, కార్యదర్శి దయానంద్, టీఎన్‌జిఒ అధ్యక్షులు వెంకటిరెడ్డి, టీజిఓ అధ్యక్షులు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కవి, తత్వవేత్తగా మహర్షి వాల్మీకి..

మహర్షి వాల్మీకి గొప్ప కవి, తత్వవేత్తగా పేరుగడించారని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహర్షి వాల్మీకి జయంతి ఆశ్వీయుజ పౌర్ణమి రోజున నిర్వహించుకోవడం జరుగుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి చందర్, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారిలో కలెక్టర్ పర్యటన..

గాంధారి : మండలంలోని వివిధ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వన్ పర్యటించారు. మండలంలోని సీతాయిపల్లి గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి కొనుగోలు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అలాగే ముదేల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పలు రికార్డులు పరిశీలించి పిల్లలకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆర్డిఓ ప్రభాకర్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో రాజేశ్వర్, ఏఎంసీ చైర్మన్ పరమేష్, ముద్దెల్లి పిఎసిఎస్ చైర్మన్ సజ్జనపల్లి సాయిరాం, వివిధ శాఖల అధికారులు, నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

విధులు మరిచి.. ఫోన్లు పట్టి..



నవతెలంగాణ-కామారెడ్డి

విధులు నిర్వర్తించాల్సిన కలెక్టర్ కార్యాలయ ఉద్యోగులు తమ ఫోన్లను చూడడంలో నిమగ్నమైపోయారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించగా.. అందులో భాగంగా కంటివైద్య పరీక్షలు చేశారు. కంటి పరీక్షలు చేయించుకునేవారు ఒక్కరినొకరు తోసుకుంటూ వెళ్తున్నా.. వీరిని వరుసలో పంపించవలసిన ఉద్యోగులు.. విధులను మరిచి పక్కనే చేయిర్లలో కూర్చుని సెల్‌ఫోన్ చూడడంలో నిమగ్నమైపోయారు. అక్కడి డాక్టర్లు చెప్పినా.. వారు మాత్రం వారి ఫోన్లను చూస్తూ కూర్చుండిపోయారు.

సాలూర మండల వ్యవసాయాధికారిగా కెతావత్ శ్వేత



నవతెలంగాణ-బోధన్

నూతనంగా ఏర్పాటు చేసిన మండలాలకు ప్రభుత్వం ఎట్టకేలకు మండల స్థాయి అధికారుల నియామకాలను చేపట్టింది. గత నెల క్రితం మండల విద్యాశాఖ అధికారుల నియామకం చేపట్టిన ప్రభుత్వం ప్రస్తుతం మండల వ్యవసాయ శాఖ అధికారుల నియామకాలను చేపట్టింది. అందులో భాగంగా సాలూర మండలానికి కెతావత్ శ్వేతను మండల వ్యవసాయ శాఖ అధికారిగా నియమించింది. కెతావత్ శ్వేత నిజామాబాద్‌లో ఏఈఓగా పనిచేశారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారుల నియామకాలకై నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఆమె ఉత్తీర్ణత సాధించడంతో ప్రభుత్వం ఆమెను సాలూర మండల తొలి వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు అప్పగించింది.

పదోన్నతులు కల్పించాలి

- క్యాంపస్‌లో అధ్యాపకుల నిరసన

నవతెలంగాణ-భిక్కనూర్

అధికారులు స్పందించి పదోన్నతులు కల్పించాలని అధ్యాపకులు కోరారు. గురువారం మండలంలోని బిటిఎస్ వద్ద తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న రెగ్యులర్ సహాయ ఆచార్యులు పదోన్నతులు ఇవ్వడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నందున అధికారుల నిర్లక్ష్యం కారణంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులు మాట్లాడుతూ.. గత ఆరు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించకపోవడం, అర్హత ఉన్నా పదోన్నతులు పొందలేక పోతున్నామని తెలిపారు. అనంతరం సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్ బాబు, హరిత, అంజయ్య, నాగరాజు, ప్రతిజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఎంబిబిఎస్‌లో సీటు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరంలోని లలిత నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి చెందిన ఎం. వైష్ణవి ఎంబీబీఎస్‌లో అత్యుత్తమ ర్యాంక్ సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. దీంతో వారి తల్లిదండ్రులు గిరీష్, సంధ్యలు ఆనందం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లాలో ములుగు ఈఎన్టి మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీట్ రావడం ఆనందంగా ఉందని అన్నారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి మంచి మార్కులు సాధించి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించడంపై వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఎంబీబీఎస్ పూర్తి చేసి పేద వారికి ఉచితంగా వైద్యం అందించాలని పలువురు వైష్ణవికి సూచించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



ఉపాధ్యాయులకు వీడ్కోలు పలుకుతున్న చిన్నారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలోని మారుతినగర్ మండల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు గురువారం విద్యార్థులు వీడ్కోలు తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన చంద్రశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఉత్తమ విద్యా బోధన అందించి బదిలీపై వెళ్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మాదకద్రవ్యాల నిరోధానికి చర్యలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గంజాయి, క్లోరోఫామ్, అల్ప్రాజోలం వంటి మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నిరోధానికి సంబంధిత శాఖల అధికారులు కలిసికట్టుగా కృషి చేస్తూ పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. ఈ మేరకు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి మాదకద్రవ్యాల నిరోధక కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, రవాణా తదితర అంశాలపై సమావేశంలో చర్చించి, వాటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ సూచనలు చేశారు. జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని అన్నారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన వైజాగ్, పాడేరు, అరకు తదితర ఏరియాల నుండి నిజామాబాద్ మీదుగా గంజాయిని అడపాదడపా మహారాష్ట్రకు స్మగ్లింగ్ చేస్తున్నందున గట్టి నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా రోడ్డు, రైలు మార్గాల ద్వారా వీటిని రవాణా చేసే అవకాశాలు ఉన్నందున ఆర్టీసీ, రైల్వే అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని, తనిఖీ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఉంచాలని అన్నారు. గంజాయి విక్రేతలను, దానిని వినియోగించే వారిని గుర్తించి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. అదేవిధంగా కల్తీ కల్లు తయారీ కోసం వినియోగించే అల్ప్రాజోలం నిల్వలను వెలికితీయాలని, ఈ దిశగా, పోలీస్, ఎక్సైజ్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని కలెక్టర్ హితవు పలికారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరిస్తూ విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు వీటికి అలవాటుపడకుండా ఉండేందుకు వీలుగా కళాశాలల్లో క్రమం తప్పకుండా అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటుపడిన వారిని ఆ వ్యసనం మానుకునేలా డీ-అడిక్షన్ సెంటర్లలో చేర్పించాలని అన్నారు. కాగా, గడిచిన 2023 తో పోలిస్తే జిల్లాలో ఈ ఏడాది గంజాయి కేసులు కొంతవరకు తగ్గాయని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ వివరించారు. ఎక్సైజ్ శాఖతో సమన్వయం పెంపొందించుకుని మత్తు పదార్థాల రవాణా, వినియోగాన్ని పూర్తిగా అరికట్టే దిశగా పోలీస్ శాఖ తరపున కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, అదనపు డీ.సీ.పీ బస్వారెడ్డి, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎక్సయిజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, ఆర్టీసీ ఆర్.ఎం జానీరెడ్డి, డీఐఈఓ రవికుమార్, అటవీ, రవాణా, వాణిజ్య పన్నులు, ఔషధ నియంత్రణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మచ్చ వినోద్‌కు నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఒకటి కాదు.. రెండుకాదు ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు ఓయువకుడు. అదికూడా ఒకే సంవవత్సరంలో సాధించి ఔరా అనిపించాడు. ఒకవైపు ఒక ఉద్యోగం చేస్తూ మరోవైపు పోటీ పరీక్షకు ప్రిపేర్ అయ్యాడు. అన్నింట్లో మంచి ర్యాంకులతో ఉద్యోగాన్ని సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలిచాడు. ఇందల్‌వాయి మండలం లోలం గ్రామానికి చెందిన మచ్చ వినోద్ ఒకే సంవత్సరంలో నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆయన విద్యాభ్యాసం 10వ తరగతి - కాకతీయ హైస్కూల్, నిజామాబాద్ 2009లోనే ఇంటర్, డిగ్రీ - గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల 2014లో పూర్తి చేసి, ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ (రెగ్యులర్), ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్ (తెలుగు) డిస్టెన్స్ పూర్తి చేశారు. అనంతరం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సబ్జెక్ట్ అసోసియేటివ్ (మ్యాథ్స్) (2019-2021) ఉద్యోగం సాధించారు. వరంగల్ సైనిక్ స్కూల్ అర్థమెటిక్, రీజనింగ్ ఫ్యాకల్టీ (2021-2024) గా విధులు నిర్వహిస్తుంగగానే, పిజిటి లో 12వ ర్యాంకు (స్టేట్లో) జులై 2024 (మోర్తాడ్‌లో ఆల్రెడీ పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్ జాబ్ చేస్తున్నారు.) ఉద్యోగం చేశారు. అంతలోనే డిఎస్సీలో జిల్లా 9వ ర్యాంక్ సాధించారు. ఎంతగానో ఆసక్తితో ఎదురు చూస్తున్న ఉద్యోగం స్కూల్ అసిస్టెంట్ సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్ రాగానే సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాబ్ చేసుకుంటూ ఇంట్లోనే స్వంతంగా సుమారు 6 గంటలు చదివి ఎగ్జామ్‌కు ప్రిపేర్ అయ్యారనని తెలిపారు. మీకంటూ ఒక లక్ష్యం పెట్టుకొని నిరంతరం కష్టపడి చదివితే ఖచ్చితంగా ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని తెలిపారు. ఏకాగ్రతతో ప్రశాంతమైన, ఒత్తిళ్ళు లేని, స్వేచ్ఛాయుత వాతవరణంలో చదవాలని, ఏకబిగిన గంటల తరబడి చదవొద్దని, మధ్యమధ్యలో విరామం తీసుకుంటూ ఉండాలని అన్నారు. వరుసగా చదువుతూ ఉండటం కాకుండా ఎంతవరకు నేర్చుకున్నామో రెండు మూడు రోజులకు పరీక్షించుకుంటూ ఉండాలని తెలిపారు. దీనివలన కొత్తవి నేర్చుకునే ప్రేరణ, ఉత్సాహం వస్తాయి సూచనలు చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్‌లో చేరిన బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో బిఆర్ఎస్ పార్టీ మండల మైనారిటీ అధ్యక్షులు, బాల్కొండ మాజీ ఉప సర్పంచ్ షేక్ వాహబ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సయ్యద్ మజారోద్దీన్, సల్ల నర్సయ్య సొసైటీ డైరెక్టర్, గ్రామాభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు పిప్పెర అశోక్, మాజీ వార్డ్ మెంబర్ తోట గంగాధర్, ఎర్రన్న, నరేష్, అరిఫ్, ఉమేర్, తౌఫీక్ తదితరులు ఉన్నారు. పార్టీలో చేరిన వారికి బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో జరుగుతున్న ప్రజాపాలనకు ఆకర్షితులై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాల్కొండలో ముత్యాల సునీల్ కుమార్ నాయకత్వంలో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని పార్టీలో చేరిన వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని మంచిప్ప గ్రామానికి చెందిన భాను, జ్యోతి ఇద్దరిని గురువారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. నాటు సారా విక్రయిస్తున్నారని వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై మల్లేష్ తెలిపారు.

పైపుల లీకేజీతో నీరు కలుషితం కాకుండా చూడాలి

- మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ రామచందర్



మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ రాంచందర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మిషన్ భగీరథ పైపుల లీకేజీతో నీరు కలుషితం కాకుండా చూడాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ రాంచందర్ అన్నారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామశివారులోగల మిషన్ భగీరథ కార్యాలయంలో ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల గ్రామ మంచినీటి సహాయకులకు మూడవరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ రామచందర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్లైన్లు లీకేజీ కాకుండా చూసుకుంటూ లీకేజ్ అయిన నీటితో నీరు కలుషితం కాకుండా చూడాలని గ్రామ మంచినీటి సహాయకులకు సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్ అయితే గ్రామ మంచినీటి సహాయకులు దాన్ని రిపేర్ చేస్తూ గ్రామ ప్రజలకు నాణ్యతగల నీటిని అందించాలన్నారు. గ్రామాలకు వచ్చిన మిషన్ భగీరథ వాటర్‌ను వాటర్ ట్యాంకులకు నింపిన తర్వాత వాటర్ ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ వేసి 45 నిమిషాల తర్వాత ప్రజలందరికీ తాగడానికి నీరును సరఫరా చేయాలని సూచించారు. గ్రామాల్లో బోరు బావులు కలుషితం కాకుండా చూడవలసిన బాధ్యత గ్రామ మంచినీటి సహాయకుల మీద ఉందని తెలిపారు. గ్రామంలోని ప్రజలందరూ మిషన్ భగీరథ వాటర్ తాగేందుకు అవగాహన కల్పించాలని తెలిపారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లో బ్లీచింగ్ పౌడర్ ఏ విధంగా కలపాలో ఒక బకెట్లో బ్లీచింగ్ పౌడర్ వేసి చూపించారు. మిషన్ భగీరథ డిఈ గంగారాం, మిషన్ భగీరథ గ్రిడ్డు డిఈ శివ కృష్ణ, మిషన్ భగీరథ ఏఈలు నరేందర్‌రెడ్డి , మోహన్‌రెడ్డి, లైన్ మెన్లు, ఆర్మూర్ మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మికోద్యమ నిర్మాణంలో భాగమే విలీనం



సిరికొండ : వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ సిరికొండ

ఐఎఫ్‌టీయును టీయుసీఐలో విలీనం చేస్తూ జరిగే సభను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) ఆధ్వర్యంలో నిజామాబాద్‌నగరంలోని మున్సిపల్ సర్కిల్ టు కార్యాలయం వద్ద విలీన సభ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ దేశవ్యాప్త కార్మిక ఉద్యమ నిర్మాణంలో భాగమే టియుసిఐలో ఐఎఫ్‌టీయును విలీనం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలీన సభ నిర్వహిస్తున్నామన్నారు. మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తుందన్నారు. దేశ సంపదను, కార్మికుల జీవితాలను కార్పొరేట్ కంపెనీలకు తాకట్టు పెడుతుందన్నారు. మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడానికి బలమైన కార్మిక ఉద్యమ నిర్మాణం అవసరమన్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 14రాష్ట్రాల్లో కార్మికుల పక్షాన పోరాడుతున్న టియుసిఐలో ఐఎఫ్‌టియును విలీనం చేస్తున్నామన్నారు. కార్మికుల హక్కుల కోసం కనీస వేతనాల అమలుకోసం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం మరింత విప్లవ స్ఫూర్తితో పోరాడుతామన్నారు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో రెండు కార్మిక సంఘాల విలీనం జరిగిందన్నారు. ఈనెల 20న జరిగే సభను మున్సిపల్ కార్మికులు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కిరణ్, గంగాధర్, శాంతికుమార్, శివకుమార్, లక్ష్మయ్య, వరలక్ష్మి, శైలజ, నర్సయ్య, విజయ్, లక్ష్మి, గంగామణి, సరస్వతి, గంగారం తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: ఐఎఫ్‌టీయును టీయుసీఐలో విలీనం చేస్తూ ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లాసహాయ కార్యదర్శి ఆర్. రమేష్ అన్నారు. ఈమేరకు మండలకేంద్రంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. మోడీ, ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికులను కట్టు బానిసలు చేసే విధానాలను అమలు చేయకుండా బలమైన ఉద్యమాలకోసం ఈ విలీనం అని అన్నారు. ఈ విలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు రామకృష్ణ, డివిజన్ నాయకులు దామోదర్, కార్మిక సంఘ నాయకులు అనిల్, రవి, అశోక్, రాజేశ్వర్, కార్మికులు పాల్గొన్నారు

ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నిక





నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ఐద్వా 4 వ మహాసభల సందర్భంగా నూతన జిల్లా కమిటీ 13 మందితో ఎన్నుకున్నట్లు గురువారం తెలిపారు. జిల్లా అధ్యక్షురాలిగా అనిత, ప్రధాన కార్యదర్శి, సుజాతను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లాలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలకు, దాడులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. విద్యా, వైద్యం, స్థానిక సమస్యలపై కూడా ఆందోళనలు చేస్తామని తెలిపారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు, బతుకమ్మ సంబరాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. మహిళలకు వస్తున్న సమస్యలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తూ చైతన్య పరుస్తామని తెలిపారు. రానున్న కాలంలో కూడా మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ మహిళలను చైతన్యపరిచే విధంగా కృషి చేస్తామని అన్నారు. నూతన జిల్లా కమిటీ సభ్యులుగా కటారి లావణ్య, రజియా, వనజ, హసీనా, సాయమ్మ, విజయలక్ష్మి, మాధవి, కళ, సంతోషిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

19న బాలబాలికలకు ఈత ఎంపికలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లాలో ఈత ఎంపికలు అండర్ 14, 17 బాలురు, బాలికలకు ఈనెల 19న సమయానికి హాజరుకావాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎం. నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ విద్యార్థి ఒరిజనల్ బోనాఫైడ్ సర్టిఫికెట్‌ను తీసుకురావాలని, అండర్ 14 (బాలురు) 01-01-2011 లేదా తర్వాత జన్మించినవారు (6వ తరగతి, ఆపై విద్యార్థులకు), అండర్ 17 బాలురు, బాలికలు 01-01-2008 తర్వాత జన్మించినవారు 6వ తరగతి, ఆ పై విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం ఈ ఫోన్ నెంబర్ 9347216426 కు సంప్రదించాలని తెలిపారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల కేంద్రానికి చెందిన ఓవ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. దడివే రాజేందర్ (59) కొన్నేళ్లనుండి మద్యానికి బానియ్యాడు. ప్రతిరోజు ఇంటికి మద్యం తాగి వచ్చేవాడు. ఈనెల 16న మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి రాగా భార్య మద్యం ఎందుకు తాగి వచ్చావని అడిగింది. దీంతో కోపంతో ఇంట్లో నుండి వెళ్లిపోయాడు. భీంగల్ శివారులోని అడ్డగుట్టలో అడవిలో చెట్టుకు లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు చేయగ ఎస్సై జి. మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రామడుగు పట్టాదారుల భూముల్లో
అటవీ అధికారుల దౌర్జన్యం అరికట్టాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర నాయకులు
- పి. రామకృష్ణ డిమాండ్



మాట్లాడుతున్న సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకులు

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వం ఇచ్చిన ప్రాజెక్టు రామడుగు గ్రామ పట్టాదారుల భూముల్లో అటవీఅధికారులు పెత్తందారూల్లా వ్యవహరిస్తూ చేస్తున్న దౌర్జన్యంను అరికట్టాలని కోరుతూ గురువారం సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్ రాష్ట్ర నాయకులు పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నానిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం 2005లో 200మందికి 1150 సర్వేనెంబర్‌లో పట్టాలు ఇచ్చిందని, సిఎల్ డిపి పథకం కింద నిధులను మంజూరు చేసి ఒడ్లు పోసి చదును చేసి నిర్మాణం పనులు చేపట్టిదన్నారు. గ్రామంలో కొంతమంది పెత్తందారులు సైతం అధికారులకు వత్తాసు పలకడం సిగ్గుచేటు అన్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ప్రాజెక్టు రామడుగు గ్రామ ఎస్సీ, ఎస్టీ, బిసి పేదలు తమ పట్టా భూములను సమస్య పరిష్కారం అయ్యే వరకు ఎదురు నిలబడి పోరాడాలన్నారు. సమస్య పరిష్కారం పట్ల మానవత దృక్పథంతో వ్యవహరించాలన్నారు. ప్రభుత్వం ఓట్ల కోసం పేదలను మభ్యపెట్టడం కాకుండా పేదలకు సంబంధించిన పట్టా భూముల సమస్యను సత్వరమే పరిష్కారానికి పూనుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఇచ్చిన మాట ప్రకారం వారం రోజుల వరకు ఓపిక పడతామన్నారు. అయినా సమస్య పరిష్కారం కాకుంటే భూముల మీదికి పేదలు వెళ్లడం ఖాయమన్నారు. పోరాడితే తప్ప మన సమస్య పరిష్కారం కాదని ప్రాజెక్టు రామడుగు పట్టాదారులు గ్రహించాలన్నారు. పోరాడితేనే మీ భూములు మీకు వస్తాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్)మాస్ లైన్‌ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్ . రమేష్, డివిజన్ నాయకులు ఆర్ . దామోదర్, పట్టేదారులు టీ . అనిల్, రవి, శ్రీనివాస్, లక్ష్మి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలి

- డిటిఎఫ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

గత నాలుగు నెలల క్రితం బదిలీ అయిన ఉపాధ్యాయులను సబ్బిట్యూట్ లేరనే కారణంతో విడుదల కాని వారిని వెంటనే విడుదల చేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) భీంగల్ మండల శాఖ అధ్యక్షులు బల్లెం జాన్ విల్సన్, ప్రధాన కార్యదర్శి గట్టు ఈశ్వర్ గురువారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలు చేపట్టి వారికి స్థానాలు కేటాయించిన ప్రక్రియ పూర్తికాగానే తమను విడుదల చేస్తారని భావించిన ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిందని పేర్కొన్నారు. వారు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో ని ఉపాధ్యాయులు కొందరు 12 సంవత్సరాలుగా పనిచేస్తున్నా రిలీవ్ కాని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వారి మానసిక ఆందోళనను ప్రభుత్వం అర్థం చేసుకొని సబ్బిట్యూట్ లేకుండా వారిని రిలీవ్ చేసి, వారి స్థానంలో విద్యా వాలంటీర్లను నియమించి ఈ విద్యాసంవత్సరాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

మంచి నీటిని ప్రతి గృహానికి అందించాలి

- మిషన్ భగీరథ సిఈ రాంచందర్, ఎస్ఈ రాజేందర్ కుమార్



మాట్లాడుతున్న మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

అనునిత్యం గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందజేసే విధంగా చూడాలని, నీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ఎక్కడ లీకేజీలు లేకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటిస్తూ ఉండాలని మిషన్ భగీరథ సిఈ రాంచందర్, ఎస్ ఈ రాజేందర్ కుమార్ అన్నారు. గురువారం ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని రైతు వేదికలో గ్రామీణ మంచి నీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మూడవరోజు పాల్గొని మాట్లాడారు. మంచి నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తూ ఉండాలని అన్నారు. ఎక్కడ లీకేజీలు ఉన్నా వెంటనే మరమ్మతులు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో కలుషిత నీరు చేరి ఇబ్బందులు కలుగుతూ ఉంటాయని, అలాంటివి జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో ఉన్న నీటి ట్యాంకుల్లో క్రమం తప్పకుండా క్లోరినేషన్ ఏ మోతాదులో వేయాలో తెలుసుకుని అదే విధంగా చేయాలని సూచించారు. పైప్లైన్, గేట్ వాళ్ళ మరమ్మత్తుల విషయంలో క్వాలిటీకి సంబంధించిన వాటిని బిగించి లీకేజీలు లేకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఇఇ నరేష్, డీఈఈ ధర్మేందర్, డీఈఈ అరుణ్, మిషన్ భగీరథ ఏఈఈ దీప్‌చంద్, ఏఈఈ శివ, సహాయకులు, ట్రైనర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు ఇక్కట్లు

- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు

నవతెలంగాణ-మోపాల్

మండలంలో తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేయడానికి పట్టపద్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎమ్మెల్సీ ఓటుకు అప్లై చేసుకోవాలి అంటే కచ్చితంగా మూడుసార్లు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు వేయాలి. ఒకసారి అప్లికేషన్ ఫామ్ లేదంటారు, రెండోసారి వెళ్తే అప్లై చేస్తారు. మళ్లీ అప్లై చేసిన వారం రోజుల తర్వాత తాసిల్దార్ కార్యాలయం నుంచి మీ వర్జినల్ సర్టిఫికెట్స్ డిప్యూటీ ఎమ్మార్వో తీసుకురమ్మన్నారని ఆఫీసు సిబ్బంది పట్టభద్రులకు ఫోన్ చేస్తారు. హైదరాబాద్‌లాంటి ప్రాంతంలో ఉద్యోగాలు చేసేవారు అప్లికేషన్ ఫామ్ ఇచ్చి వెళ్తున్నారు. మళ్ళీ తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌ను తీసుకొని తాసిల్దార్ కార్యాలయం రావాలంటే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది.సెలవు దినాల్లో వస్తే ఇక్కడ కార్యాలయాలకు కూడా సెలవు ఉంటుంది. వారి ఆఫీసుల్లో సరైన సమయంలో వారికి లీవ్స్ ఇవ్వరు.. ఇలాంటి పరిస్థితిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదు చేసుకోవాలా..లేదా.. ఓటు వేయాలా.. లేదా అని ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ తాసిల్దార్ కార్యాలయం నిర్వహించాల్సి ఉంటుంది. దీనిపై ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పట్టబద్రులు కోరుతున్నారు. ఒకవేళ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించకపోతే పట్టబదులు ఎమ్మెల్సీ ఓటు నమోదు విషయంలో వెనకంజలో ఉంటారు. ఓటు అనే ఆయుధానికి పట్టభద్రులందరూ దూరమవ్వాల్సి ఉంటుంది.

శాసన మండలి పట్టభద్రుల ఎన్నికల్లో విద్యావంతులను గెలిపించాలి

- స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గాల్లో విద్యావంతులను గెలిపించాలని, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్క విద్యావంతుడు దోహద పడాలని స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ బండారి రాజ్ కుమార్ అన్నారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చాలామందికి ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన లేదని, వారికోసమే ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ నరేశ్, నిఖిల్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన మున్సిపల్ చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్లు



సన్మానించిన కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పురపాలక సంఘం నూతన చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన పద్మ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఎల్లారెడ్డి మున్సిపల్ కేంద్రంలోని కార్యాలయంలో పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టి పక్షం రోజులు గడవకముందే ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నందుకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన సేవలను కొనియాడారు. ప్రజాసేవలో ఇదే తరహాలో ముందుకు సాగుతూ ప్రజల ఆశీర్వాదంతో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు జంగం నీలకంతం, అల్లం శీను, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, పోచయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కారేగాం ఇందిరమ్మ కమిటీ

- గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం



సభలో మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-పొతంగల్

మండలంలోని కారేగాం గ్రామపంచాయతీలో గ్రామ కార్యదర్శి గ్రామసభను ఏర్పాటు చేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించే దృక్పథంతో ఇందిరమ్మ కమిటీని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ ప్రత్యేక అధికారి చందర్ చైర్మన్‌గా, పంచాయతీ సెక్రెటరీ క్యాకప్పను కన్వీనర్‌గా, గ్రామస్తులు ఎన్.లక్ష్మీబాయి, మిస్సే నాగనాథ్ పటేల్, బుద్దేవ్వ శ్రీనివాస్, బాలాజీను గ్రామసభలో ఏకగ్రీవంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా గురువారం ఎన్నుకున్నారు. గ్రామ సభలో మాడెప్ప లక్ష్మణ్ పటేల్, గంగాధర్ పటేల్, ఈరవంతరావు పటేల్, మాధవరావు పటేల్ తదితరులు పాల్గొని ఆమోదింపచేసిన జాబితా తీర్మానాన్ని పంచాయతీ కార్యదర్శి మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు.



మద్నూర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్



పిట్లం: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సింగిల్ విండో చైర్మన్లు



నిజాంసాగర్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్లు

రైతులు దళారులను నమ్మొద్దు

- పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-విలేకరుల బృందం

రైతులు దళారులను నమ్మొద్దని పలువురు సూచించారు. ఉమ్మడి జిల్లాలలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు.

నసురుల్లాబాద్ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్, దుర్కి సొసైటీ చైర్మన్ డిప్యూటీ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మండలంలోని దుర్కి గ్రామంలో పిఏసిఎస్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్కి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక తహసిల్దార్ బావయ్య సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ డాక్టర్ నారాయణ, మాజీ సర్పంచ్ నారాగౌడ్, సీనియర్ నాయకుడు శంకర్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..

మద్నూర్ : డోంగ్లి మండల పరిధిలోని కుర్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రేణుక చౌహన్, డోంగ్లి సింగిల్ విండో వైస్ చైర్మన్, పాలకవర్గం సభ్యులు, సింగిల్ విండో కార్యదర్శి గంగాధర్, ఏఈఓ సమ్రిన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ పటేల్, పరమేష్ పటేల్, మండలంలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు, రైతులు, సింగిల్‌విండో సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ముస్తాపూర్, భవానిపేట్ గ్రామాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు బిపిఎం రమేష్ బాబు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఏపిఎం శ్రీనివాస్, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, సీఈఓ పెంటయ్య, డిఎల్ఓ రజినీకాంత్, సీసీలు రాజిరెడ్డి, మన్సూర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పోతాయిపల్లిలో..

మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు లింగంపేట్ సింగిల్‌విండో చైర్మన్ కుషన్‌పల్లి దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెంటయ్య, డైరెక్టర్ నీరుడి రామలింగం, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, పెద్దకాపు లక్ష్మీనారాయణ, ఆకుల సాయిరాం, నర్సింలు, కాశరం, సాయిలు, అనిల్ కుమార్, అశోక్, లింగం, రాజేందర్ సంగమేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండలంలోని లింగంపల్లి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, దామోదర్‌రావు, లింగారావు, రమేష్‌రావు, చందర్‌రావు, సాయిలు, బల్వంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలోని కాటేపల్లి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్ గంగిరెడ్డి, ఏఈఓ రూప, సొసైటీ కార్యదర్శి హన్మాండ్లు, నాయకులు వెంకట్ రెడ్డి, సాయిరెడ్డి, మల్లప్ప పటేల్, మొగులగౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం : వరి ధాన్యం, సోయా కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో చైర్మన్‌లు శపథం రెడ్డి, సాయిరెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ, అన్నారం, తిమ్మానగర్ సింగిల్ విండో ఆవరణలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం, సోయా పంటలను దళారులకు విక్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోని విక్రయించి లబ్ధి పొందాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి కృష్ణారెడ్డి దొర, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జాంబిగే హన్మాండ్లు, మాజీ జెడ్పిటిసి కుమ్మరి రాములు, సీనియర్ నాయకులు జొన్న మోహన్ రెడ్డి, చిప్ప శివ, నజీర్, కుమ్మరి రాములు, అఫ్రోజ్, కుమ్మరి శేఖర్, ఎరుకల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వమే కొంటుందని నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లికార్జున్ అన్నారు. మండలంలోని అచ్చంపేట ప్రాథమిక సహకార సంఘం సొసైటీ పరిధిలోని నిజాంసాగర్, మల్లూరు ప్రాథమిక సహకార సంఘం సొసైటీ పరిధిలోని మల్లూరు గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఆయా సొసైటీ చైర్మన్లు నరసింహారెడ్డి, ఒంటరి కళ్యాణి విఠల్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి బిక్షపతి, మండల వ్యవసాయాధికారి అమర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ఉక్కు పాదం

- ఎస్సై మహేందర్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలకు బిచ్కుంద మండలంలోని మంజీర పరివాహక ప్రాంతాల నుండి రాత్రివేళలో అక్రమ ఇసుక రవాణా చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వ్యాపారులకు ఎస్ఐ మహేందర్ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. రాత్రి వేళలో అక్రమ రవాణాను తనదైన శైలిలో అక్రమ ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని ఎటువంటి రాజకీయ నాయకుల ఒత్తిడికి గురికాకుండా చట్టపరంగా ఇసుక ట్రాక్టర్లను కేసు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నారు. గురువారం పట్టుబడ్డ రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇప్పటి వరకు దాదాపు 10 నుండి 15 అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర సరుకులను అందజేస్తున్న రామ్‌రెడ్డి నారాయణ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన నారాయణ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించడంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మట్టె రామ్‌రెడ్డి నారాయణ కుటుంబానికి నెలకు సరిపడా సరుకులు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాధవరెడ్డి, శ్రీనివాస్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ను సన్మానించిన సుభాష్‌రెడ్డి మిత్ర బృందం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన మద్ది చంద్రకాంత్‌రెడ్డిని సుభాష్‌రెడ్డి మిత్ర బృందం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం జనగామ గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సుభాష్‌రెడ్డి మిత్రులు గ్రంథాలయ చైర్మన్‌ను కలిసి శాలువాతో సన్మానించి, పూల బొకే అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సుభాష్ రెడ్డి మిత్ర బృందం సభ్యులు కప్పెర రవీందర్ రెడ్డి, మట్ట శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం



ఎంఈఓను సన్మానించిన పిఆర్‌టియు నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల విద్యాశాఖ అధికారి నిట్టూరు వి.ఆనంద్‌రావును పిఆర్‌టియు తెలంగాణ నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం గురువారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్‌రావు, ప్రధాన కార్యదర్శి జంపాల లక్ష్మీ రాజ్యం, మండల అధ్యక్షులు వెంకట్, ప్రధాన కార్యదర్శి ఆనంద్, సురేందర్‌రెడ్డి, తదితరులున్నారు.

మాదిగలను మోసం చేస్తే మూల్యం తప్పదు

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకట్రాములు



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిగలను మోసం చేస్తే భారీ మూల్యం తప్పదనీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బట్టు వెంకట్రాములు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ద్వారా అమలు చేసినప్పటికీ తెలంగాణ సీఎం వర్గీకరణ అంశాన్ని పక్కనపెట్టారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశంలో అసెంబ్లీ సాక్షిగా సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణ చేస్తామని చెప్పి దానికి భిన్నంగా మాలలకు తలొగ్గి డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని వివరించారు. మాదిగలకు అన్యాయం జరిగినప్పటికీ ఇకనైనా ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేసి వర్గీకరణ అమలు చేసిన తర్వాతనే ఉద్యోగాలు ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా సంఘం తరఫున డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ ఓంకార్ 16వ వర్ధంతి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంసిపిఐయు పార్టీ కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక నేత అసెంబ్లీ టైగర్, మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ మద్ది కాయల ఓంకార్ 16వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి జబ్బర్ నాయక్ మాట్లాడుతూ నిజాం రజాకార్లతో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తూటాలకు ఎదురెళ్లి ప్రాణానికి ప్రాణంగా పెట్టి భూములు పొందిన ఘనత కామ్రేడ్ ఓంకార్‌కు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సదానందం, పరశురాం, భార్గవి, లీల, బాల్రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్ విద్యుత్ ఏఈగా గంగాధర్



నవతెలంగాణ-సదాశివనగర్

మండలం విద్యుత్ ఏఈగా గంగాధర్ బదిలీపై వచ్చారు. ఈయన ఆదిలాబాద్ జిల్లాలో పవర్ హౌస్ బోరజ్‌లో ఏఈగా పనిచేసినట్లు తెలిపారు. సదాశివనగర్‌లో ఏఈగా పనిచేసిన ధర్మారెడ్డి కామారెడ్డి సర్కిల్ ఆఫీసుకు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

భవానీనగర్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని 18వ వార్డులో భవానీనగర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖంరెడ్డి సందర్శించారు. భవానీనగర్‌లో ఇంకుడు గుంతలున్న చోట్ల మొరం వేయించారు. కాలనీకి వచ్చే వెళ్లే ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, ఫ్లోర్ లీడర్ మీర్జా ఆఫీస్ బేగ్, పాత శివ కృష్ణ మూర్తి, వనిత రామ్మోహన్, పంపరి లతా శ్రీనివాస్, చాట్ల వంశీకృష్ణ, రాజునాయక్ కాలనీవాసులు పాల్గొన్నారు.

చేతిపంపుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మున్ని నాయక్



శిక్షణలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-బోధన్

గ్రామీణ ప్రాంతాలలో చేతిపంపులు నిర్వహణ వాటి మరమ్మతులు సక్రమంగా చేపట్టాలని గ్రామీణ నీటిపారుదల శాఖ డిఈఈ మున్ని నాయక్ అన్నారు. గురువారం బోధన్ మిషన్ భగీరథ కార్యాలయంలో నీటి సహాయకులకు నిర్వహించిన 3వ రోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో ఉన్న చేతి పంపులు పాడైన వాటిని గుర్తించి మరమ్మతులు చేయాలని, అలాగే వాటి నిర్వహణ సక్రమంగా ఉండేలా గ్రామ పంచాయతీలు బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం చేతి పంపు మెకానిక్ లియాఖత్ చేతిపంపుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఇంట్రా ఏఈ అనిల్ కుమార్, గ్రిడ్ ఏఈ చంద్రకాంత్ శర్మ మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలి

- సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ



మాట్లాడుతున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ

నవతెలంగాణ-లింగంపేట్

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ రమణ విద్యార్థులకు సూచించారు. గురువారం జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ నరేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మెంటల్ హెల్త్ అధికారి డాక్టర్ జి.రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ రమణ విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ విద్యార్థులు ప్రధానంగా మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని వాటిని అధిగమించడానికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ దశలో విద్యార్థులు ప్రేమ సంబంధిత ఆకర్షణలకు లోనవుతారని అది కేవలం వయసు రీత్యా వచ్చే ఆలోచనలేనని వాటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అలాగే మత్తు పదార్థాల జోలికి అస్సలు వెళ్ళకూడదని తెలియజేశారు. అంతేకాకుండా మొబైల్ వినియోగాన్ని కేవలం సమాచార సేకరణకు మాత్రమే వినియోగించాలని, వినోదం కోసం వినియోగిస్తే మొబైల్ ఫోన్లకు బానిసలవుతారని తెలిపారు. చదువుపై శ్రద్ధ తగ్గుతుందని వివరించారు. పరీక్షా కాలంలో విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని ముందు నుంచే ప్రణాళిక ప్రకారంగా చదువుకోవాలని అందుకు తగ్గ వాతావరణాన్ని సృష్టించుకోవాలని తెలిపారు. మానసికంగా ఎటువంటి సమస్యలు వచ్చినా దగ్గర్లోని మెడికల్ ఆఫీసర్‌ను లేదా సైకియాట్రిస్ట్‌ని సంప్రదించాలని సూచించారు. ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416ని సైతం వినియోగించుకొని కౌన్సెలింగ్ పొందవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ హిమబిందు, జిల్లా సోషల్ వర్కర్ డాక్టర్ రాహుల్ కుమార్, సిహెచ్ఓ రమేష్, అధ్యాపకులు అంజయ్య, రాజు, శ్రీలత, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్



గెలుపొందిన విద్యార్థినికి బహుమతి అందజేత

నవతెలంగాణ-బోధన్

సాలూర జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, బోధన్ ఉప విద్యాధికారి కార్యాలయంలో మండల స్థాయి సైన్స్ సెమినార్‌ను గురువారం నిర్వహించారు. సైన్స్ సెమినార్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ విధానంపై నిర్వహించారు. ఈ పోటీలలో హున్సా హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని వైష్ణవి జిల్లాస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ తెలిపారు. అలాగే బోధన్ మండల స్థాయి పోటీలను ఉప విద్యాధికారి కార్యాలయంలో నిర్వహించారు. బోధన్ మండల స్థాయి సైన్స్ సెమినార్‌లో భాగంగా "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పొటెన్షియల్స్ అండ్ కన్సర్న్స్" అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బోధన్ విజయసాయి హైస్కూల్‌కు చెందిన బుష్రా బుతూల్ అనే విద్యార్థిని ప్రథమ స్థానం సాధించి జిల్లా స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికైందని ఎంఈఓ నాగయ్య తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినికి ఎంఈఓ అభినందించారు. కార్యక్రమంలో భాగంగా మండల సైన్స్ టీచర్లు పాల్గొన్నారు.

సదాశివనగర్‌కు ఇద్దరు నూతన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలానికి 2024 డిఎస్సీలో ఎంపికపై నూతన ఉపాధ్యాయులు ఇద్దరు వచ్చినట్లు మండల విద్యాశాఖ అధికారి యూసఫ్ గురువారం తెలిపారు. మండలంలోని తిర్మన్‌పల్లి పాఠశాలకు ఎస్జిటి ఉపాధ్యాయులుగా గాండ్ల నవీన్, అమర్లబండ పాఠశాలకు మణికంఠ ఎస్జిటిలో ప్రత్యేక ఉపాధ్యాయులుగా నియామకమైనట్లు తెలిపారు.

శ్రీ సాయి సంఘం ఆధ్వర్యంలో సన్మానం



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో ఇటీవల కాలంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమించిన డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్‌రెడ్డిని శ్రీ సాయి సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించి భగవద్గీత పుస్తకాన్ని గురువారం అందజేశారు. కార్యక్రమంలో వీడిసి అధ్యక్షులు సూర్యకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బాపురెడ్డి, రాజిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇండియన్ బ్యాంక్ ప్రారంభం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో బ్యాంక్ వినియోగదారులు పెరిగిన నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ (కోడ్ 3693)ను శుక్రవారం ప్రారంభించనున్నట్టు బ్యాంక్ అధికారులు తెలిపారు. రాజేశ్వర్‌రెడ్డి, ఫీల్డ్ జనరల్ మేనేజర్ హైదరాబాద్, ముఖ్య అతిథిగా కె.రాజ్ కుమార్ జోనల్ మేనేజర్ రానునట్టు బ్రాంచ్ మేనేజర్ అరవింద్ పేర్కొన్నారు.

ఉద్యోగాల భర్తీలో కాంగ్రెస్ కృషి ఎనలేనిది

నవతెలంగాణ-మద్నూర్

అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పిస్తూ ఉద్యోగాల భర్తీ కోసం ప్రత్యేక కృషి ఎనలేనిదని మద్నూర్ మండలంలోని ఖరగ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధవరావు పాటిల్ తెలిపారు. ఖరగ్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టి ఇక్కడే చదువు మొదలు పెడుతూ ఉపాధ్యాయ వృత్తిని సాగిస్తూ గ్రామ పాఠశాలకే నూతన ఉపాధ్యాయులుగా విధులు చేపట్టడం ఎంతో ఆనందంగా ఉందని మాధవరావు పాటిల్ అన్నారు. కరగ్ గ్రామ నివాసుడు సిద్ధిరాం తండ్రి పావులే అనే యువకుడు ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ర్యాంకు సాధించి ఉపాధ్యాయునిగా నియమితులై కరగ్ గ్రామానికి పోస్టింగ్ రావడం ఆ గ్రామ ప్రజల్లో ఆ యువకుని పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాధవరావు పాటిల్ ఆధ్వర్యంలో ఆ నూతన ఉపాధ్యాయునికి శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంతోష్, తానాజీ, పాటిల్ మాధవరావు బిరాధర్ మాధవ్ పావులే నందకుమార్ పాటిల్ పాఠశాల చిన్నారులు గ్రామస్తులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | అక్టోబర్ 18, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికావు

- తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షురాలు అరుణ జ్యోతి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న అధ్యక్షురాలు అరుణ జ్యోతి

స్థానిక ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ఇటీవల హిందువుల పట్ల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ మహిళ అధ్యక్షురాలు కూరపాటి అరుణ జ్యోతి అన్నారు. గురువారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ లో మీడియా సమావేశం నిర్వహించారు. హిందువుల మనోభావాలు దెబ్బ తినేలా ఎమ్మెల్యే మాట్లాడడం సరైనది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని.. ఎమ్మెల్యే తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-ముప్కాల్


వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న ఆర్డీవో, ట్రాఫిక్ పోలీసులు

మండల కేంద్రంలో గురువారం సాయంత్రం గాంధీ చౌక్ వద్ద ఆర్మూర్ ఆర్డీవో ట్రాఫిక్ పోలీసులతో కలిసి స్టేషన్ హౌస్ ఆఫీసర్ రజినీకాంత్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. హెల్మెట్‌లేని వారికి జరిమానాలు విధించారు. ద్విచక్ర వాహన దారులు బైక్ నడిపేటప్పుడు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఆర్మూర్ ట్రాఫిక్ పోలీసులు ఉన్నారు.

వృద్ధుని అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు అదృశ్యమైనట్టు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ తెలిపిన వివరాల ప్రకారం.. డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి చెందిన సుంకరి భూమన్న ఈనెల 10వ తేదీన సాయంత్రం నాలుగు గంటలకు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అదృశ్యం అయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపారు. ఫోటోలో ఉన్న వృద్ధుడిని గుర్తిస్తే స్థానిక ఒకటవ పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ అదృశ్యమైనట్టు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా భైంసా గ్రామానికి చెందిన ఊరెళ్ల విజయ(40) గత నెల 29వ తేదీన అందజ మధ్యాహ్నం ఒంటి గంటలకు నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ నుంచి తప్పిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఒకటవ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలియజేశారు. ఫోటోలో ఉన్న మహిళను గుర్తిస్తే స్థానిక ఒకటవ పోలీస్ స్టేషన్లో సమాచారం అందించాలని కోరారు.

గాలికుంటు నివారణ టీకాలతో వ్యాధి నిరోధక శక్తి

- జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథచారి


పశువులకు టీకాలు వేస్తున్న డాక్టర్ జగన్నాథచారి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గాలికుంటు నివారణ టీకాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథచారి తెలిపారు. గురువారం మండలంలోని చింతలూరు గ్రామంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథ చారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. గ్రామంలోని అన్ని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలని అన్నారు. వ్యాధి రాకముందే టీకాలు వేయించడం వల్ల పశువులు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్క రైతు ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి శిరీష, జూనియర్ పశువైద్యాధికారి శశికళ, పశువైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పై ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు


ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసిన నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తన బాధ్యతను మరిచిపోయి సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో జరిగిన విషయంపై స్పందిస్తూ హిందూ సమాజాన్ని అవమానపరిచి హేళన చేసి మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి ఆవేశపడుతూ హిందూ సమాజాన్ని దూషిస్తూ తక్కువ చేస్తూ మతకల్లోలాలు సృష్టించడానికి కారణమవుతున్నాడని ఆరోపించారు. ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సమాజంలోని సామాన్యులు రెచ్చిపోయి భవిష్యత్తులో ల్యాండ్ ఆర్డర్ అదుపుతప్పి ఇబ్బందులు ఏర్పడతాయని అన్నారు. వెంటనే ఆయన పైన కేసు నమోదు చేయాలని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షులు గుంజల పృథ్వీరాజ్, యువజన విభాగం మండల అధ్యక్షులు ఆగ్గు క్రాంతి, మీర శ్రావణ్ , భారత్, వింటూ, వంశి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు విజయవంతం చేసినందుకు కృతజ్ఞతలు

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని శ్రావ్య గార్డెన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, అనుబంధ సంఘాల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయడంలో సహకరించిన జిల్లాలోని మాదిగ ఉద్యోగస్తులకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రమోద్ మాదిగ, ఎం ఎస్పీ జిల్లా అధ్యక్షులు సరికెల పోశెట్టి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ ఇచ్చే కార్యాచరణను అమలుపరచడంలో మాదిగ ఉద్యోగులు మండలంలో పని చేస్తున్న ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని సపోర్ట్ చేస్తూ ఉద్యోగస్తులుగా తమవంతు సహకారాన్ని అందిస్తూ ఈ రెండు నెలలు పిల్లల భవిష్యత్తు కోసం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు.

హైకోర్టు ఉత్తర్వులు తక్షణమే అమలు చేయాలి

- 2014లో పియూలో నియామకమైన అధ్యాపకులకు పదోన్నతులు కల్పించాలని నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి


వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

తెలంగాణ యూనివర్సిటీలో 2014లో నియామకం పొందిన అధ్యాపకులకు రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను అమలు పరుస్తూ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీలోని పరిపాలన భవనం ముందు నిరసన కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ పున్నయ్య యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి జరిపిన ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ ఏ నాగరాజు మాట్లాడుతూ.. గతంలో ఈసీ నిర్ణయం మేరకు తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ నుంచి న్యాయ సలహా తీసుకోవాలని నిర్ణయించారని, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ నివేదిక అందింది కనుక ప్రక్రియను త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఐదు మాసాల క్రితం పదోన్నతులు కల్పించాలని అడ్వకేట్ జనరల్ యూనివర్సిటీకి తన నివేదిక ద్వారా తెలిపారని అన్నారు. దాన్ని అమలుచేయాలని పలుమార్లు డిమాండ్ చేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం వల్ల పలువురు అధ్యాపకులు రాష్ట్ర హైకోర్టును సంప్రదించారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు ఇంటీరిమ్ డైరెక్షన్ ఇస్తూ పదోన్నతులను కల్పించాలని యూనివర్సిటీకి ఉత్తర్వులను జారీ చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ యూనివర్సిటీ అధికారులు పదోన్నతుల ప్రక్రియను రెండు వారాల్లో పూర్తి చేయాలని లేకుంటే కోర్టుదిక్కరణ నేరం కింద రిజిస్ట్రార్ ను వ్యక్తిగతంగా కోర్టుకు సెప్టెంబర్ 20న హాజరుకు కావాలని హైకోర్టు ఆదేశించినట్లు తెలిపారు. ప్రక్రియ ప్రారంభం కాకపోవడం వల్ల కోర్టుకు హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు అందిన వెంటనే ప్రక్రియను మొదలు పెడతానని కోర్టులో చెప్పినప్పటికీ నేటికీ ప్రక్రియ ప్రారంభించకపోవడం శోచనీయమని వారు పేర్కొన్నారు. పది సంవత్సరాల నుండి అధ్యాపకులందరు తీవ్రమైన మానసిక ఒత్తిడితో ఉన్నారని ఇప్పటికైనా అధికారులు కాలయాపన చేయకుండా తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని గౌరవిస్తూ, రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులను వెంటనే అమలులోకి తీసుకు వచ్చి పదోన్నతులు కల్పించాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఏకగ్రీవంగా తీర్మానించిందని వివరించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి పదోన్నతుల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరి, కార్యదర్శులు డాక్టర్ బాలకిషన్ , డాక్టర్ నీలిమా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ప్రసన్నశీల , డాక్టర్ వాసం చంద్రశేఖర్ డాక్టర్ స్వప్న, డాక్టర్ స్రవంతి, డాక్టర్ మహేందర్, డాక్టర్ రమణాచారి, డాక్టర్ కిరణ్ మై, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు కూలిబంధు ఇవ్వాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న పెద్ది వెంకట్రాములు

వ్యవసాయ కార్మికులకు 12 వేల కూలి బంధు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (వ్యకాస) జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం నాందేవ్ వాడలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ.. సమాజంలో 70శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలిపారు. వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12వేల చొప్పున కూలి బంధు పథకాన్ని అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు కూడా రైతు బంధు, రైతు భీమా పథకాన్ని అమలు చేస్తూ ఇండ్లు లేని వ్యవసాయ కూలీలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని తెలిపారు. ప్రతి ఇంటికి అధికారులు వెళ్లి అందరికీ డిజిటల్ కార్డులు, ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బొర్ర సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షురాలు గోళం లక్ష్మి, సహాయ కార్యదర్శి జి.లక్ష్మణ్, గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు జి.చంద్రకాంత్, రాజేశ్వరిలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లకోసం దరఖాస్తుల వెల్లువ


డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలోని రెండు పడకల గదుల (డబుల్ బెడ్ రూమ్) రెండవ విడతకు సంబంధించి అధికారులు గురువారం అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డబుల్ బెడ్ రూమ్ కోసం మొదటి రోజు 139 మంది అర్జీదారులు దరఖాస్తు చేసుకున్నారని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ రమేష్ తెలిపారు. అర్హులైన అర్జీదారులు రెండు పడకల నివాస గృహాల కోసం ఈనెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ అద్ప శ్రీధర్ తెలిపారు. ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, తదితర డాక్యుమెంట్లను జతచేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఆయన కోరారు.

యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు

తెలంగాణ ప్రభుత్వం తక్షణమే యూనివర్సిటీలకు రెగ్యులర్ వీసీలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రఘురాం డిమాండ్ చేశారు. ఐఏఎస్ అధికారులు ఇంచార్జ్ వీసిలుగా ఉండటంతో యూనివర్సిటీలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. గురువారం నగరంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వీసీలను నియమించడంలో అలసత్వం వహించకుండా రెగ్యులర్ వీసిలను నియమించాలని కోరారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ విసిల నియమిస్తామని, యూనివర్సిటీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, తక్షణమే విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ యూనివర్సిటీలకు తక్షణమే రెగ్యులర్ వీసీలను నియమించాలని, యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో మెస్ డిపాజిట్ల పద్ధతిని ఎత్తివేయాలని, తెలంగాణ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి ఉచితంగా మెస్, హాస్టల్ సౌకర్యం కల్పించాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన తరగతి గదులు, హాస్టల్ నిర్మాణాలు చేపట్టాలని, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు స్కాలర్ షిప్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంజలి, కుషాల్, భార్గవి, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు


దిబ్బ అనిల్ మృతదేహం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామానికి చెందిన దిబ్బ అనిల్(20), కనుగుర్తి శివ రాజు కలిసి బుధవారం రాత్రి పల్సర్ బైక్‌పై బషీరాబాద్ గ్రామానికి వెళ్లారు. తిరిగి గురువారం రాత్రి సమయంలో పల్సర్ బైక్‌పై వస్తున్నారు. కమ్మర్‌పల్లి గ్రామ శివారులో హాస కొత్తూర్ రోడ్డులో గల శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాల సమీపంలో ప్రమాదానికి గురయ్యారు. బైక్ నడుపుతున్న అనిల్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతో మూల మలుపు వద్ద బైక్ కంట్రోల్ కాకపోవడంతో రోడ్డు పక్కన గల వ్యవసాయ భూమిలోకి దూసుకుపోయాడు. అనిల్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనకాల కూర్చున్న శివరాజు కూడా తీవ్ర గాయాలతో హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడని ఏఎస్ఐ నరేందర్ తెలిపారు. మృతుడు అనిల్ పెద్దనాన్న దిబ్బ గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఏఎస్ఐ నరేందర్ తెలిపారు.

డీసీసీ అధ్యక్షుడిగా వేణుగోపాల్‌ను నియమించాలి

- బీసీ విద్యార్థి సంఘం

నవతెలంగాణ-ముప్కాల్


మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

గడిచిన 20 సంవత్సరాల నుంచి రాష్ట్ర విద్యార్థి సంఘ నాయకుడిగా అణగారిన వర్గాల వారి సమస్యల పోరాటంలో ముందుండి పోరాడిన బీసి బహుజన విద్యార్థి సంఘ నాయకుడు, టీపీసీసీ ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్‌కు జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని జిల్లా బీసీ విద్యార్థి సంఘం జనరల్ సెక్రటరీ ద్యాగ శేఖర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు తెలంగాణ యూనివర్సిటీని కేటాయించాలంటూ విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాల్లో పాల్గొన్నట్టు పేర్కొన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఏర్పాటుకు జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేయించి జిల్లాకు తెలంగాణ యూనివర్సిటీని సాధించడంలో కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. అంతే కాకుండా వైయస్సార్ హయాంలో బాసరలో ట్రిపుల్ ఐటీకి విద్యార్థి సంఘాలకు కన్వీనర్‌గా పని చేశారన్నారు. బాసరలో ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంలో కీలక పాత్ర పోషించిన విషయాన్ని సైతం ప్రస్తావించారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ విద్యార్థి సంఘం నాయకులు నీరజ్, మహేష్, కార్తీక్ యాదవ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌గా పేదలకు సేవలందించాలి

- పాఠశాల కరస్పాండెంట్ గుండోజి దేవేందర్
- ఎంబీబీఎస్ సీటు సాధించిన పూర్వ విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


విద్యార్థిని అభినందిస్తున్న కరస్పాండెంట్

భవిష్యత్తులో మంచి డాక్టర్‌గా పేద ప్రజలకు సేవలందించాలని విజ్ఞానజ్యోతి పాఠశాల కరస్పాండెంట్ గుండోజీ దేవేందర్ అన్నారు. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన జక్కని శ్రీవర్శిని తమ పాఠశాలలో పదవ తరగతి వరకు చదివిన పూర్వ విద్యార్థిని ఎంబిబిఎస్ సీటు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు గురువారం కరస్పాండెంట్ గుండోజి దేవేందర్ శ్రీవర్శినిని పాఠశాలకు ఆహ్వానించి అభినందించి, శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ ప్రతిమ రికవరీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌమ్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ, పీజీ కళాశాలలు పునఃప్రారంభం

- నిరవధిక సమ్మె విరమణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ


ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేస్తున్న యాజమాన్యాలు

డిగ్రీ, పీజీ కళాశాలల్లో పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలనే డిమాండ్‌తో చేపట్టిన నిరవధిక బంద్ ను విరమించినట్లు తెలంగాణ యూనివర్సిటీ ప్రైవేట్ కాలేజీ మేనేజ్ మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంబోజి హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరి వెంకటేశం ఇచ్చిన హామీ మేరకు బంద్‌ను విరమిస్తున్నట్లు తెలిపారు. గత సంవత్సరం జారీ చేసిన టోకెన్స్ మొత్తంను వారం రోజుల్లో విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వంతో రాష్ట్ర నాయకత్వం జరిపిన చర్చల్లో ప్రిన్సిపాల్ సెక్రటరి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు బంద్ ను విరమించి రేపటి నుంచి కళాశాలలను పునఃప్రారంభిస్తామని తెలిపారు. ప్రభుత్వంతో చర్చించడానికి సహకరించిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. క్రిష్ణయ్య, ప్రైవేటు డిగ్రీ కళాశాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సూర్యనారాయణ, యూనివర్సిటీ పరిపాలన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

సీపీఐ(ఎం) వర్ని ఏరియా కార్యదర్శిగా నన్నేసాబ్

నవతెలంగాణ-వర్ని



సీపీఐ(ఎం) వర్ని ఏరియా కార్యదర్శిగా నన్నేసాబ్ ఎన్నికయ్యారు. రుద్రూర్ మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఏరియా 2వ మహాసభలో పార్టీ సభ్యులు నన్నేసాబ్ ను ఏరియా కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి రమేష్ బాబు గురువారం తెలిపారు. కమిటీ సభ్యులుగా లక్ష్మణ్ (రుద్రూర్), సాయిబాబు (వర్ని), గంగాధర్ (మోస్రా), రాములు (పోతంగల్), లక్ష్మణ్ (కోటగిరి), సాయిబాబా (చందూర్) ఎన్నికయ్యారు. ఏరియాలో పార్టీ బలోపేతంకోసం కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. పోడు సాగుదారులకు షరతులు లేకుండా పట్టాలు ఇవ్వాలని, కౌలు రైతులకు రైతు భరోసా, రైతు భీమా, పంట నష్ట పరిహారం అందేలా చూడాలని తెలిపారు. నూతన మండలాల్లో కాలేజీలు నిర్మించాలని, ఏరియాలో మహిళా పోలీస్ స్టేషన్‌తో పాటు, మహిళా డిగ్రీ కాలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేయాలని తీర్మానాలు చేసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం మారినా విద్యార్థుల బాధలు మారవా ?

- బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు

నవతెలంగాణ- కామారెడ్డి

ప్రభుత్వాలు మారినా విద్యార్థుల బాధలు మారావా అని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన విద్యార్థి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను గత ప్రభుత్వం సరిగా విడుదల చేయకపోవడం వల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అదే పంథాను ఈ ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజు బకాయిలను విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్, రవికుమార్, శ్రావణ్, మోహన్ చారి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకు ఫాగింగ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



ఎన్నో నెలల తరువాత నిజామాబాద్ నగరంలోని ప్రతి కాలనీలో ఫాగింగ్ చేశారు. మున్సిపల్ శాఖ వారు దోమల నివారణకు నగరంలో కనీసం వారం పది రోజులకైనా ఒకసారి చేయవలసిన ఫాగింగ్ గురించి పూర్తిగా మర్చిపోయింది. ఎన్నో నెలల తర్వాత ఫాగింగ్ చేయడంతో ఫాగింగ్ మిషన్స్ ఉన్నాయా... అని వాహనదారులు, నగర ప్రజలు ఆశ్చర్యంగా చూశారు. నిజామాబాద్ నగరంలోని వినాయక నగర్ ప్రాంతానికి చెందిన శ్రీనగర్ కాలనీలో గురువారం రాత్రి ఫాగింగ్ చేపట్టారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/ కంఠేశ్వర్/ఆర్మూర్/పెద్దకొడప్‌గల్/కామారెడ్డి

ఆదికవి మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకలకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధ్యక్షత వహించగా, నగర మేయర్ నీతూకిరణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం, జ్యోతి ప్రజ్వలన చేసి జయంతి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్ని కులమతాలకు చెందిన సంప్రదాయాలు, పండుగలకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ, మహనీయుల జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. ఇందులో భాగంగానే మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వపరంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. మహోన్నతమైన రామాయణ గ్రంథాన్ని అందించిన మహాకవి వాల్మీకిని ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దుర్గుణాలను విడనాడి, సద్గుణాలను అలవర్చుకోవాలని, సమాజ అభ్యున్నతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. వాల్మీకి రచించిన రామాయణంలోని ప్రతి ఘట్టం నైతిక, సామాజిక విలువలను ఉపదేశిస్తుందని, కుటుంబ బంధాలు, సుపరిపాలన వంటి అనేకానేక అంశాలను బోధిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి రమేష్, నర్సయ్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరేష్, బీ.సీ సంఘాల నాయకులు బుస్సా అంజనేయులు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ :నిజామాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు డిసిపి (అడ్మిన్) కోటేశ్వర రావు, అదనపు డిసిపి (లా అండ్ ఆర్డర్) బస్వారెడ్డి, అదనపు డిసిపి (ఎ.ఆర్) శంకర్ నాయక్ ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి ఫోటోకు పూలమాలలు వేశారు. అనంతరం అదనపు పోలీస్ కమిషనర్లు మాట్లాడుతూ.. శ్రీ మద్రామాయణ మహాకావ్య సృష్టికర్త మహర్షి వాల్మీకి అని, బోయవాడిగా అడవిలో పెరిగి, ఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకిగా మారి అద్భుతమైన రామాయణం గ్రంధాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి అని అన్నారు. సమాజ శ్రేయస్సుకు అవసరమైన జీవన సూత్రాలను రామాయణం ద్వారా వాల్మీకి బోధించారని తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్లు శంకర్, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ పోలీస్ కార్యాలయం సిబ్బంది, సిసి ఆర్‌బి సిబ్బంది, సిఎస్‌బి సిబ్బంది, ఐటి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి :జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి, సూపరింటెండెంట్‌లు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ జార్జ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నవీన్ కుమార్, సంతోష్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, డిపిఓ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ:భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.ఆర్. శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆదికవి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె రంగారెడ్డి హాజరై మాట్లాడారు. దళిత సమాజానికి చెందిన వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించడం గొప్ప కార్యమని తెలిపారు. అసమానతలు లేని సమాజం కోసం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇస్కాన్ బృందం భజన కార్యక్రమం నిర్వహించింది. కార్యక్రమంలో కుమార్, బాలకృష్ణ, సంజీవ్, ముత్యం, దీపక్, కెప్టెన్ రాజు, ముక్తార్ సింగ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు

పెద్దకొడప్‌గల్:మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ సంజీవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు గొర్రె రాములు, విట్టల్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ సిటీ: పూలమాలవేస్తున్న కలెక్టర్

ఆర్మూర్ :మండలంలోని చేపూర్ క్షత్రియ పాఠశాలలో ఆదికవి వాల్మీకి జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహస్వామి వాల్మీకి చిత్ర పటానికి పూలమాలవేసి ప్రిన్సిపాల్ మాట్లాడారు. కృషి ఉంటే మనుషులు ఋషులౌతారు... మహా పురుషులౌతారు... అన్న దానికి వాల్మీకి మహర్షి చక్కని ఉదాహరణ అని అన్నారు. బోయవాడైన వాల్మీకి సంస్కృతంలో 24వేల శ్లోకాలతో కూడిన రామాయణం రచించిన ఒక గొప్ప మహర్షి అని అన్నారు. సంపూర్ణ మానవాళికి రామాయణంను అందించిన గొప్పవ్యక్తి వాల్మీకి అని కొనియాడారు. విద్యార్థులందరు వాల్మీకి మహర్షిని ఆదర్శంగా తీసుకొని జీవితంలో ముందడుగు వేయాలని అన్నారు. ఈనెల 25న హర్యానాలోని రోతక్‌లో నిర్వహించిన 43వ సబ్ జూనియర్ బాల్ బాడ్మింటన్ జాతీయస్థాయి టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం నుండి పాల్గొన్న క్షత్రియ పాఠశాల విద్యార్థి బోనగిరి శ్రీ హర్ష తృతీయ స్థానం సంపాదించి తన ప్రతిభను చాటినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థికి క్షత్రియ విద్యాసంస్థల చైర్మన్ అల్జపూర్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ లక్ష్మీ నరసింహస్వామి, అభినందనలు తెలిపారు.



కామారెడ్డిలో..



కంఠేశ్వర్ : సీపీ కార్యాలయంలో



ఆర్మూర్ : క్షత్రియలో..

దేవాలయాల కూల్చివేతపై ఫిర్యాదు చేసిన బిఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ఓపెన్ ప్లాట్‌లో ఏర్పాటు చేసుకున్న ముత్యాలమ్మ, పోచమ్మ, లక్ష్మీ దేవి దేవాలయాలను తెల్లవారుజామున మున్సిపల్ అధికారులు తొలగించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐకి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ గత ఐదు నెలల క్రితం పురాతన విగ్రహాలను మున్సిపల్ ఓపెన్ ల్యాండ్‌లో ఏర్పాటు చేసుకుని మూడు ఆలయాలను నిర్మించడం జరిగిందన్నారు. మున్సిపల్ అధికారులు వాటిని తొలగించడం సరైంది కాదన్నారు. వెంటనే అధికారులు స్పందించి మూడు ఆలయాలను పునర్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి, బీఆర్ఎస్ నాయకులు వేణుగోపాలరావు, కృష్ణమోహన్, హౌసింగ్ బోర్డ్ కాలనీవాసులు, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-సదాశివనగర్/పెద్దకొడప్‌గల్

మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో విజయ డెయిరీ అధ్యక్షులు దుబ్బాక నర్సారెడ్డి, బి.ఎం.సి సూపర్‌వైజర్ యాడారం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ :మండల కేంద్రంలోని పెద్దకొడప్‌గల్ తండాలో గురువారం పశువులకు గాలికుంటు టీకాలను వేసినట్లు ఓ.ఎస్.సురేష్ తెలిపారు. 15 రోజుల వరకు ఉచిత గాలి కుంటు నివారణ టీకాలు వేయనున్నట్టు పేర్కొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పూర్తిచేయాలి

నవతెలంగాణ-దోమకొండ

ఎల్ఆర్ఎస్ క్షేత్రస్థాయి ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ అధికారులకు సూచించారు. దోమకొండ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను గురువారం అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల విచారణను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, ఆర్ఐ మహేందర్ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దు

విండో చైర్మన్ నాగిరెడ్డి



శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న విండో చైర్మన్

నవతెలంగాణ-పిట్లం

వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని చిన్న కొడప్ గల్ సింగిల్ విండో చైర్మన్ నాగిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చిన్నకొడప్‌గల్ సింగిల్ విండో పరిధిలోని కాటేపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

శనగ విత్తనాలు పంపిణీ..

మండలంలోని చిన్నకొడప్‌గల్ సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతులకు రబీసీజన్‌కు గాను శనగ విత్తనాలు పంపిణీ చేసినట్లు విండో చైర్మన్ నాగిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నకొడప్‌గల్ విండో పరిధిలోని ధర్మారం, బుర్నాపూర్, అల్లాపూర్, పారేడ్పల్లి, కాటేపల్లి గ్రామాల రైతులకు రబ్బీ సీజన్‌కు గాను శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, ఆసక్తి గల రైతులు విండో సిబ్బందిని సంప్రదించి కొనుగోలు చేపట్టాలని సూచించారు. 25 కేజీల బస్తా రూ.2,250 పూర్తి ధర చెల్లించాల్సి ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విండో సీఈఓ హన్మాండ్లుగౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వృద్ధుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రానికి చెందిన వడ్డే శ్రీను (70) అనే వృద్ధుడు చేపల వేటకు వెళ్లి మృతి చెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. గాంధారి మండల కేంద్రానికి చెందిన వడ్డే శ్రీను బుధవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో గాంధారి గ్రామానికి చెందిన కాటిపాకల లక్ష్మణ్‌తో కలిసి నేరేల్ గ్రామ శివారులో గల చెరువు(కుంట)లో చేపలు, యేండ్రికాయలు పట్టడానికి వెళ్లాడు. అక్కడ వడ్డే శీను వల తీసుకొని చెరువులోకి దిగి వల చుట్టుకొని నీట మునిగి చనిపోయాడు. మృతుని భార్య వడ్డే సాలవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ ప్రాపబుల్స్‌కు క్రీడాకారులు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాంఘిక సంక్షేమ పాఠశాల బాలుర క్రీడా మైదానంలో జరిగిన జిల్లా సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ ఎంపికలో 30 మంది బాలురను ప్రాబబుల్‌కు ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ శిబిరం నిర్వహించి తుది జట్టును ఎంపిక చేసి ఈనెల చివరి వారంలో జరిగే రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ సాయన్న, సీనియర్ ఉపాధ్యాయులు గంగాధర్, అకాడమీ కోచ్ ఈ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, సంతోష్, రాజేందర్ పాల్గొన్నారు.

కాలేజీల నిర్వహణ భారంగా మారింది

ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.గంగాధర్

ప్రయివేటు డిగ్రీ కళాశాల యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో ర్యాలీ

నవతెలంగాణ-బోధన్

గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఫీజు బకాయిలను చెల్లించక పోవడంతో కాలేజీల నిర్వహణ భారంగా మారిందని ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.గంగాధర్ అన్నారు. రాష్ట్ర ప్రైవేట్ పీజీ, డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నాల్గవ రోజు బోధన్ పట్టణంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు అంబేద్కర్ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ ఎదుట బైఠాయించి, సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.గంగాధర్ మాట్లాడుతూ.. తమకు రావలసిన బకాయి డబ్బులు న్యాయంగా మంజూరి చేయాలని నిరసన చేస్తున్నామని అంతేకాని విద్యార్థులను ఇబ్బందులు పెట్టాలని తమ అభిమతం కాదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల నిరవధిక బందుకు పిలుపునిచ్చి ప్రతిరోజు నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేసినట్లయితే విద్యార్థులకు రాబోయే రోజులలో నాణ్యమైన విద్యను అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ప్రిన్సిపాల్‌లు హరికృష్ణ, శ్రీధర్ రాజు, షేక్ రషీదుద్దీన్, అధ్యాపకులు శ్రీకాంత్, దత్తు, శేఖర్, పవన్, నితిన్, దశరథ్, శ్రీనివాస్, హనుమంతు, అంజాద్, నమ్రత, తేజస్విని, పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కళాశాలల యాజమాన్యాలు

బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మందులను అందించాలి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య కేంద్ర సిబ్బందికి నెలవారి ఆరోగ్య రివ్యూ సమావేశం గురువారం నిర్వహించినట్టు మండల వైద్య అధికారి రోహిత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఆశ కార్యకర్త గ్రామస్థాయిలో బిపి, షుగర్ వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరించి ప్రతినెల మందులను అందజేయాలని ఆయన సూచించారు. గ్రామస్థాయిలో గర్భిణీ స్త్రీల వివరాలను సేకరించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. ఏఎన్ఎంలు గ్రామాలలో ఉండి వాడవాడలో పర్యటించి వ్యాధిగ్రస్తులకు తగు సూచనలు చేసి వ్యాధి నుంచి విముక్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన సూచించాడు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నార

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూరు మండల కేంద్రంలో ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. బీర్కూర్‌కు చెందిన తాటిచెట్ల రాములు బుధవారం రాత్రి పంట పొలం నుంచి తిరిగి వస్తున్న సమయంలో బాన్సువాడ, పోతంగల్ వెళ్లే రహదారిపై ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బీర్కూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నీరు నిలువగల ప్రదేశాలను గుర్తించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నీరునిలువగల ప్రదేశాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదించాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. గురువారం డిచ్ పల్లి మండలంలోని నడిపల్లి గ్రామంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ ఆదేశాను సారం జాతీయ కీటక జనిత వ్యాధుల నిరోధక కార్యక్రమంలో భాగంగా డెంగ్యూ కేసుల తగ్గించుటకు దోమలు దోమ లార్వను నాశనం చేయడానికి డెమో ఫాస్ పైరిత్రిన్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువగల ప్రదేశాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదించాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ఎవరైనా జ్వరంతో బాధపడినట్లయితే తొందరగా గ్రామ ఆరోగ్య సిబ్బందిని కలిసి తగిన మాత్రలు వేసుకోవాలని సూచించారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులతో, గ్రామ మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పరచుకొని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ కేసు నమోదు అయిన గ్రామంలో కచ్చితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దోమల లార్వా నివారణకు నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని నీటి నిల్వగల ప్రాంతాలలో గంబుషియా చేపలు, ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. దోమలను నిర్మూలించడానికి స్ప్రే చేయించాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నడ్పల్లి మేజర్ గ్రామ పంచాయతీ గ్రేడ్ వన్ కార్యదర్శి నిట్టు కిషన్ రావు,ఆరోగ్య కార్యకర్త సుజాత ఎం ఎల్ హెచ్ పి రేణుక, కారోబార్ సంతోష్, ఆశా కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఒత్తిడిని జయించి మనోధైర్యంతో జీవించాలి

- మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం కామారెడ్డి జిల్లా మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ జి.రమణ ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణ మాట్లాడుతూ మనిషి తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయినప్పుడు నిస్సహాయుడిగా ఉన్నప్పుడు తనకు భవిష్యత్తు అంధకారంగా కనిపించినప్పుడు విపరీతమైన మానసిక ఒత్తిడికి గురవుతాడని అదే బాధలో ఆత్మహత్య ప్రేరేపితా ఆలోచనలు వైపు మళ్ళీ ఆత్మహత్య చేసుకుంటారని అన్నారు. మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారు ఉచిత టోల్ ఫ్రీ నెంబర్ 14416ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు పరీక్షలలో ఫెయిల్ అయ్యామని, ఉద్యోగం రాలేదని, ప్రేమ విఫలమైందని, జీవితంలో ఇంకేమి సాధించలేమని ఒత్తిడికి గురై అయోమయ పరిస్థితిలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఒత్తిడికి గురికావొద్దని, ఈ తరహా ఆలోచనలు తగ్గాలంటే ప్రతి వ్యక్తి రోజు వ్యాయామం, యోగా, ధ్యానం చేస్తూ మానసిక దృఢంగా ఉండాలని, ఒత్తిడిని జయించి మనోధైర్యంతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రాహుల్, డాక్టర్ సచిన్, రాణి, సరిత, కళాశాల ప్రిన్సిపాల్ నిజాం అధ్యాపకులు సతీష్, గౌతమి, వైశాలి, రాధా, సాయగౌడ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్య నిపుణులు డాక్టర్ రమణ